సాక్షి నిజామాబాద్

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



క్రీడాకారుల అడ్డా

నిజామాబాద్ నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి మహిళా ఫుట్‌బాల్ టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతోంది.

- 8లో ▸



నమ్మకం పోతోంది

పంట రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వంపై రైతులకు నమ్మకం పోతోందని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.4 /23.7

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షంనుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మూడు శాఖలతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన



నిజామాబాద్ అర్బన్: మూడు శాఖల అధికారులు పరిశీలించిన తర్వాతే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, డీపీవో తరుణ్‌కుమార్, నీటి పారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలన్నారు. మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో జీపీ ఆధ్వర్యంలో పరిశీలించాలన్నారు. రెండు నెలల్లో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటి నమూనాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ నాగారం: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి నమూనాలను అధికారులు శనివారం సేకరించారు. ప్రాజెక్ట్‌లో కలుషిత జలాలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. కలెక్టర్, ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో ఎన్వీరాన్‌మెంటల్ ఇంజినీర్ అధికారులు జలాశయాన్ని పరిశీలించారు. నీటి నమూనాలను సేకరించారు. ఈ నమూనాలను సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రపురంలో ఉన్న జోనల్ ల్యాబ్‌కు పంపుతామని తెలిపారు. కందకూర్తి, బాసర ప్రాంతంలో సైతం నమూనాలు సేకరిస్తామన్నారు.

జిల్లాలో 23.3 మి.మీ. వర్షపాతం



నిజామాబాద్ అర్బన్: జిల్లాలో శనివారం 23.3మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మోస్రాలో 83.4 మి.మీ, రెంజల్‌లో 75.5, ఏర్గట్లలో 50.3, నవీపేటలో 46.9, భీమ్‌గల్‌లో 38.4, బాల్కొండలో 37.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలోని పది మండలాల్లో అధిక, 23 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.



జీజీహెచ్ ఎదుట నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

స్తంభించిన ఓపీ వైద్య సేవలు

- కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై వెల్లువెత్తిన నిరసనలు
- జిల్లా వ్యాప్తంగా ఆందోళనలో పాల్గొన్న ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులు
- జీజీహెచ్‌లో విధులు బహిష్కరించి ధర్నా
- నిందితులను శిక్షించే వరకు ఉద్యమాన్ని ఆపబోమని ప్రకటన



జీజీహెచ్ వద్ద వేసిన చిత్రం

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారంపై శనివారం జిల్లావ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు నిజామాబాద్ నగరం, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు స్తంభించాయి. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్యులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది కలెక్టరేట్‌లోని తమ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. హత్యాచారానికి గురైన వైద్యురాలి చిత్రపటానికి నివాళులు అర్పించారు. నిందితులకు శిక్ష పడే వరకు ఉద్యమాన్ని ఆపబోమని ఆందోళనలో పాల్గొన్న వైద్యులు స్పష్టం చేశారు.

నిజామాబాద్ నాగారం: కోల్‌కతాలో పీజీ వైద్యురాలిపై లైంగిక దాడి చేసి, హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అప్పటి వరకు ఉద్యమం ఉద్యమిస్తామని జూనియర్ డాక్టర్లు అన్నారు. జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం విధులు బహిష్కరించి జీజీహెచ్ ఎదుట నిరసన చేపట్టారు. బాధితురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జూడాల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ నీరడి, జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. నిందితుల కు శిక్ష పడే వరకు ఉద్యమాన్ని ఆపబోమన్నారు. వీరికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘురాం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూడాలు విద్వాన్, కార్తీక్, భగీరథ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

'కోల్‌కతా ఘటన'పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ డిమాండ్ చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం ఎదుట సిబ్బందితో కలిసి ఆమె నిరసన తెలిపారు. ప్రజారోగ్యాన్ని కాపాడే వైద్యులపై ఇలాంటి ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. డాక్టర్ వెంకటేశ్, సూపరింటెండెంట్లు వినయ్, సూర్యనారాయణ, డీపీవో విశాల, గంగమణి, రేఖ, స్వప్న, అనురాధ, షాజహాన్, సుమ, చందన, లతా, ఫరానా పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

ఐఎంఏ ఆధ్వర్యంలో..

కోల్‌కతా ఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తెలంగాణ ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపివేశారు. అనంతరం గంగాస్తాన్‌లోని ఐఎంఏ భవనంలో బాధితురాలికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. వైద్యుల నిరసనకు మద్దతు తెలిపారు. వైద్యురాలిపై జరిగిన ఘటనను ఆయన ఖండించారు. తమ ప్రభుత్వం వైద్యులకు అండగా ఉంటుందన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శి కొట్టూరు శ్రీశైలం మాట్లాడుతూ ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని, రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా విచారణ చేయాలన్నారు. పలువురు డాక్టర్లు మాట్లాడుతూ అత్యాచార ఘటన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తానా సంఘం జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, కప్పల రాజేశ్, ఐడీఏ అధ్యక్షుడు మంజునాథ్, మేఘన దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ ప్రతాప్ కుమార్, సీనియర్ వైద్యులు జయని నెహ్రూ, రాంమోహన్‌రావు, సాంబశివరావు, హరిప్రసాద్‌రావు, కవిత రెడ్డి, రమాదేవి, వినోద్ కుమార్‌గుప్తా, కొలయ్య, సుభాష్, అజ్జ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సహకార చట్టానికి తూట్లు

- ముడుపులు ఇవ్వనివాళ్లను లక్ష్యం చేసుకుని వేధింపులు
- నవీపేట సొసైటీలోనూ ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకున్న సింహాచలం
- కలెక్టర్ పేరు చెప్పి నవీపేట సీఈవోను సస్పెండ్ చేసిన వైనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కీలకమైన జిల్లా సహకార అధికారి కుర్చీలో కూర్చుని ఏకంగా సహకార చట్టానికే తూట్లు పొడిచి.. ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకున్న మాజీ డీసీవో సింహాచలం వ్యవహారాలు కథల మాదిరిగా వెలుగులోకి వస్తున్నాయి. నవీపేట సహకార సంఘంలో సింహాచలం నడిపించిన కథ మచ్చుకు ఒకటి కావడం గమనార్హం. ఈ సంఘంలో సీఈవోగా పనిచేసిన పి నరేష్ పట్ల జరిగిన వేధింపులను గమనిస్తే సింహాచలం తీరు అర్థమవుతుంది. నరేష్ అనారోగ్య కారణాలతో నవీపేట సొసైటీలో సెలవుకు దరఖాస్తు చేశాడు. ఇందుకు గాను 2020 జనవరి 17న సొసైటీ తీర్మానం చేసింది. ఈ క్రమంలో ఎన్నికలు రావడంతో కొంతకాలం సహకరించమని సొసైటీ పాలకవర్గం కోరడంతో ఏవిధమైన సంతకాలు పెట్టకుండా వ్యవహరించాడు. ఎన్నికల తరువాత 2020 ఏప్రిల్ 23 నుంచి నరేష్ సెలవుపై వెళ్లాడు. ఇలా వెళ్లినప్పటికీ అప్పటి డీసీవో సింహాచలం, నరేష్‌కు సంబంధం లేని ధాన్యం లారీల ట్రక్‌షీట్ల తేడాలను చూపుతూ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చాడు. ఇక్కడ విచిత్రమేమిటంటే రైస్‌మిల్లుకు వెళ్లిన ఈ లారీలను 2020 మే 1న అప్పటి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పట్టుకున్నారు. ఎంవోయూ ఉల్లంఘించి ట్రక్‌షీట్లలో తేడాలు చేసినట్లు అదనపు కలెక్టర్ గుర్తించారు. మరో విచిత్రమేమిటంటే ఎంవోయూ (పౌరసరఫరాల శాఖతో సహకార సంఘం ఒప్పందం)లో డీసీవోగా ఉన్న సింహాచలం సంతకం ఉండడం గమనార్హం. దీనికి నరేష్‌కు ఏవిధమైన సంబంధం లేకపోవడం విశేషం. లారీని పట్టుకున్నది మే 1న కాగా, ఈ విషయమై సొసైటీ సీఈవో నరేష్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఒకరోజు ముందే అనగా 2020 ఏప్రిల్ 30న ఆదేశించినట్లు సస్పెన్షన్ ఉత్తర్వుల్లో సింహాచలం పేర్కొనడం.. పైగా సస్పెన్షన్ లెటర్‌ను వాట్సాప్ గ్రూపులో మాత్రమే పెట్టడం విశేషం.

1964 రాష్ట్ర సహకార చట్టం ఉల్లంఘన..

సొసైటీ సీఈవోను సస్పెండ్ చేయాలంటే 1964 సహకార చట్టం ప్రకారం డీసీవో సొసైటీకి సిఫారసు మాత్రమే చేయాలి. అయితే సింహాచలం ప్రాథమిక విచారణ కూడా చేయకుండా నేరుగా నరేష్‌ను సస్పెండ్ చేశారు. తర్వాత 2020 మే 6న సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ జియావుద్దీన్‌ను విచారణాధికారిగా నియమించారు. సొసైటీ చైర్మన్, ఇన్‌చార్జి సీఈవో వివరణ మేరకు నరేష్ తప్పులేదని జియావుద్దీన్ మే 9న నివేదిక ఇచ్చారు. ఎంవోయూ విషయంలో తప్పు సొసైటీదేనని తేలింది. అయినప్పటికీ నరేష్‌పై సస్పెన్షన్ ఎత్తేయలేదు. ఇలా ఉండగా 2020 మే 28న సింహాచలం నరేష్‌కు ఫోన్ చేసి పచ్చలనడకుడ సొసైటీకి వెళ్లాలని చెప్పారు. నెల తర్వాత సదరు సొసైటీ చైర్మన్ నరేష్‌ను వెనక్కు పంపారు. దీంతో సస్పెన్షన్ ఎత్తేయలేదని, ఎక్కడికీ వెళ్లొద్దని సింహాచలం నరేష్‌ను ఆదేశించారు. చివరకు సస్పెన్షన్ ఎత్తేయకపోతే కోర్టుకు వెళతానని నరేష్ చెప్పడంతో 2020 డిసెంబర్ 18న, సస్పెన్షన్ ఎత్తేస్తూ సింహాచలం లెటర్ ఇచ్చారు. పోస్టింగ్ మాత్రం ఇవ్వలేదు.

■ ఇదేవిధంగా సింహాచలం ధర్పల్లి మండలం హొన్నాజీపేట సొసైటీ సీఈవో నర్సయ్యను సస్పెండ్ చేశారు. నర్సయ్య హైకోర్టుకు వెళ్లి సస్పెన్షన్ రద్దు చేయించుకోవడం గమనార్హం.

■ 2021 ఏప్రిల్ 3న నరేష్‌కు సిరికొండ సొసైటీకి వెళ్లాలని సింహాచలం మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. ఆర్డర్ ఇవ్వాలని అడుగగా రూ.లక్ష డిమాండ్ చేసినట్లు నరేష్ ఆరోపించారు. సిరికొండలో 2021 ఏప్రిల్ 9న విధుల్లో చేరిన నరేష్ 2022 జూలై 30న రిలీవ్ అయ్యారు. ఇదిలా ఉండగా సహకార చట్టంలోని సెక్షన్ 59 ప్రకారం జిల్లాలో మొత్తం 17 మందిని సస్పెండ్ చేసిన సింహాచలం 15 మందిని కాపాడడం విశేషం. నరేష్, నర్సయ్యను మాత్రం చట్టాన్ని ఉల్లంఘించి సస్పెండ్ చేయడం గమనార్హం.

ట్రక్‌షీట్ల మాయాజాలం

- సిరికొండ సొసైటీలో ధర్మకాంటా, టైమ్‌స్లాట్ ఫొటోలు లేకుండానే ఎంట్రీ
- అయినప్పటికీ బిల్లుల చెల్లింపు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని సిరికొండ సహకార సంఘంలో గత (2024) యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరించి ఎంట్రీ చేసే విషయంలో మాయాజాలం చేశారు. మాయాజాలం చేసిన విషయంలో అంతా సన్నబియ్యమే కావడం గమనార్హం. ప్రైవేటు వ్యక్తుల వద్ద లారీల తూకం వేసి ప్రభుత్వానికి అప్పజెప్పారు. గత సీజన్‌లో 6 లక్షల బస్తాలను సిరికొండ సొసైటీ ద్వారా సేకరించారు. వీటిలో చాలా వరకు ట్రక్‌షీట్ల విషయంలో మాయాజాలం చేసినట్లు తెలుస్తోంది. కొన్ని బిల్లులు మాత్రం 'సాక్షి'కి లభించాయి. వాటికి సంబంధించి జక్రాన్‌పల్లి మండలం చింతలూరులోని ఒక రైస్‌మిల్లుకు ధాన్యం లారీ లోడ్లను పంపించారు.

వీటికి సంబంధించి 2024 ఏప్రిల్ 14న లారీ లోడ్లు వెళ్లగా అదే రోజు అన్‌లోడ్ చేసుకోవడం విశేషం. సాధారణంగా అన్‌లోడ్‌కోసం సీజన్‌లో లారీలు నాలుగు రోజుల నుంచి వారం రోజుల వరకు వేచిచూడాల్సిన పరిస్థితి. ఇలాంటి నేపథ్యంలో వెళ్లిన వెంటనే సదరు లారీలు అన్‌లోడ్ కావడం గమనార్హం. పైగా ఈ లోడ్లకు సంబంధించి ధర్మకాంటా రశీదులు, టైమ్ స్లాట్ ఫొటోలు అనేవే లేకుండా ఎంట్రీ చేశారు. ఇలా టైమ్‌స్లాట్ ఫొటోలు, ధర్మకాంటా రశీదులు లేకుండా ఎంట్రీ చేసిన వాటికి డబ్బుల చెల్లింపు చేయకూడదు. అయినప్పటికీ తక్షణమే చెల్లింపులు చేయడం పట్ల ముఖ్యమైన అధికారుల పాత్ర సైతం ఉన్నట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ట్రక్‌షీట్లను ధాన్యం కొనుగోలు కేంద్రం బదులు సదరు రైస్‌మిల్లులోనే రాసినట్లు తెలుస్తోంది. ఇలా చాలా లారీలను పంపినట్లు రైతులు తెలిపారు. ఇదిలా ఉండగా రైతుల వద్ద బస్తాకు రూ.15 చొప్పున హమాలీ ఖర్చులు వసూలు చేసి, హమాలీలకు మాత్రం కేవలం రూ.11 మాత్రమే ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం ఇలాంటి విషయమై హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలను పంపి విచారణ చేయించాలని డిమాండ్లు వస్తున్నాయి.

పోడు పట్టాల పంపిణీపై వివరాలు అందించండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

నిజామాబాద్ అర్బన్: పోడు భూముల పట్టాల పంపిణీకి సంబంధించిన సమగ్ర వివరాలను అందించాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి శనివారం ఆమె ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల్లో ఇప్పటి వరకు పోడు పట్టాల పంపిణీ కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎంతమందికి పట్టాలు పంపిణీ చేశారని ఆరా తీశారు. ఇప్పటి వరకు రెండు సార్లు పోడు పట్టాలు పంపిణీ చేసినా ఇంకా గిరిజనుల నుంచి దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. అర్హత కలిగిన కుటుంబాలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ఎక్కడ కూడా అటవీ భూముల ఆక్రమణ, చెట్ల నరికివేత జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. కాగా, సిరికొండ మండలం రావుట్లలో అటవీ భూమిని కొంతమంది ఆక్రమిస్తున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మంత్రికి ఫిర్యాదు చేశారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనిపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ అదనపు కలెక్టర్‌ను పంపించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పోడు భూముల సమస్య ఉందని, అర్హులైన వారికి న్యాయం చేయాలని మంత్రిని కోరారు. మారుమూల తండాలు, అటవీ సరిహద్దు గ్రామాలకు రోడ్లు నిర్మించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగోరావు, అటవీ శాఖ డివిజనల్ అధికారి భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

20 నుంచి ఓటరు జాబితా సవరణ

నిజామాబాద్ అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ఈ నెల 20 నుంచి అక్టోబరు 18 వరకు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ లోకేశ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సూచనలు చేశారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి తిరుగుతూ ఓటరు జాబితా ప్రకారంగా పరిశీలన చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, అవసరమైన చోట వివరాల సవరణ చేయాలని సూచించారు. అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు సీఈవో తెలిపారు. వీటిపై సవరణలు, అభ్యంతరాలను నవంబరు 28 వరకు స్వీకరించాలని, వాటిని డిసెంబరు 24 లోపు పరిష్కరించాలని ఆదేశించారు. 2025 జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఇంటింటి సర్వే చాలా ముఖ్యమన్నారు. సర్వే నిర్వహణపై నియోజకవర్గ స్థాయిలో మాస్టర్ ట్రైనర్స్ ద్వారా బీఎల్‌వోలకు అవగాహన తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునికం.. ఆధ్యాత్మికం

సంప్రదాయాలను మరవని నవతరం యువతులు

ఎక్కడ ఉన్నా పండుగలపై తగ్గని ఆసక్తి

ఉరుకులు పరుగుల జీవితంలోనూ ఆధ్యాత్మిక ఆలోచనలు ఆగలేదు. ఆధునికత ఎంత అలవడినా సంప్రదాయం మరుగున పడలేదు. ఎల్లలు దాటినా మన పండుగలపై మరుపు రాలేదు. ఎక్కడ ఉన్నా, ఎంత పని ఒత్తిడితో సతమతమవుతున్నా సంప్రదాయాలను కొనసాగిస్తూనే ఉన్నారు నవతరం యువతులు. ఉన్నత విద్యనభ్యసించి వివిధ ఉద్యోగాలు చేస్తున్న యువతులెందరో సంప్రదాయబద్ధంగా పండుగలను జరుపుకుంటున్నారు. వారిపై సండే స్పెషల్..

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పాశ్చాత్య నాగరికత ఎంత విస్తరిస్తున్నా.. పొద్దస్తమానం కంప్యూటర్లతో కుస్తీ పడుతున్నా.. మన యువతులు సంస్కృతి, సంప్రదాయాలను మాత్రం మరిచిపోవడం లేదు. కన్నవారి నుంచి నేర్చుకున్నవి ఆచరిస్తూ సంప్రదాయాలపై తమకు ఎంతో గౌరవం ఉందని చాటుతున్నారు. మహిళలు ఎంతో సంప్రదాయంగా జరుపుకునే వరలక్ష్మి వ్రతాన్ని నేటి తరం యువతులు కూడా అనుసరిస్తున్నారు. ఎక్కడ ఉన్నా పండుగ కోసం ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. వీలుకాని పక్షంలో తాము ఉంటున్న చోటే వాటిని ఆచరిస్తున్నారు. జిల్లాకు చెందిన పలువురు చదువు, ఉద్యోగాల కోసం దేశ విదేశాలకు వెళ్లారు. అక్కడే స్థిరపడ్డారు. అక్కడ కూడా వారు సంప్రదాయాలను పాటిస్తున్నారు. సంప్రదాయాలు, పండుగలపై వారి అభిప్రాయాలు..



వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్న కామారెడ్డికి చెందిన కుటుంబం

ఆచార, వ్యవహారాలను పాటిస్తాం



నేను యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్‌లో ఎంఎస్ చేస్తున్నాను. మనం ఎక్కడ ఉన్నా ఆచార, వ్యవహారాలను పాటించాలని అమ్మానాన్నలు చెప్పిన మాటలు గుర్తున్నాయి. చదువుకోవడానికి లండన్‌కు వచ్చినా మన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తున్నాం. పూజా కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా ఎంతో ఆనందాన్ని పొందుతున్నాను. – రక్షిత, లండన్ (కామారెడ్డివాసి)

పండుగ కోసం ఇంటికి వచ్చా..



మా ఇంట్లో పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుతారు. మాలాంటి కొత్త తరం వారికి సంప్రదాయాలు నేర్చుకునే అవకాశం పండుగల సందర్భంగా కలుగుతుంది. అందుకే ప్రతి పండుగకు ఇంటికి వస్తా. ప్రస్తుతం వరలక్ష్మి వ్రతంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌నుంచి వచ్చాను.

–దన్నారపు వర్షిత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, భిక్కనూరు

సంప్రదాయబద్ధంగా..



లండన్‌లో ఫార్మాసూటికల్ సైన్స్‌లో మాస్టర్స్ చేసి ఇక్కడే క్వాలిటీ అస్యూరెన్స్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. దేశ సంస్కృతి, సంప్రదాయాలంటే చిన్ననాటి నుంచి అవగాహన ఉంది. చదువు, ఉద్యోగరీత్యా లండన్‌లో ఉంటున్నా.. పండుగల ను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటాం. భక్తితో వరలక్ష్మి వ్రతాన్ని చేసుకున్నాం. – రవళిరెడ్డి, లండన్ (కామారెడ్డివాసి)

క్లుప్తంగా

‘ఓపెన్‌’ ఫీజు చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్‌: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ ద్వారా నిర్వహించే ఓపెన్‌ స్కూల్‌ ఎస్సెస్సీ, ఇంటర్‌ పరీక్ష ఫీజును చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్‌ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. సాధారణ రుసుముతో ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు, రూ.25 అపరాధ రుసుముతో ఈనెల 31 నుంచి సెప్టెంబర్‌ 4వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుముతో సెప్టెంబర్‌ 5 నుంచి 9వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఏపీ ఆన్‌లైన్‌లో, మీ సేవ సెంటర్ల ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

కళాశాలల ఆకస్మిక తనిఖీ



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్‌ (ఖిల్లా), ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాలలను జిల్లా ఇంటర్‌ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్‌ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ, ఆన్‌లైన్‌ నమోదు, విద్యార్థుల ఫొటోలు, సంతకాల ఆన్‌లైన్‌ ప్రక్రియ, రెండు కళాశాలల్లో అకడమిక్‌, అడ్మిషన్లపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు. కళాశాలల ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో రాఖీ కౌంటర్‌



ఖలీల్‌వాడి: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని నిజామాబాద్‌ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ లాజిస్టిక్స్‌(కార్గో) తరఫున స్పెషల్‌ రాఖీ కౌంటర్‌ను డిపోమేనేజర్‌–1 బీఎస్‌ ఆనంద్‌ శనివారం ప్రారంభించారు. దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులకు, బంధువులకు ఆర్టీసీ కార్గో ద్వారా రాఖీలు పంపించాలని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీ ట్రాప్‌పై శాఖాపరమైన విచారణ

ధర్పల్లి: మండల కేంద్ర గ్రామపంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన సంధ్యారాణి ఏసీబీ అధికారులకు పట్టుబడగా, శాఖాపరమైన విచారణను అధికారులు చేపట్టారు. శనివారం ధర్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్‌, ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 2014లో ధర్పల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి గా పని చేసిన సంధ్యారాణి ఇంటి నిర్మాణ పర్మిషన్‌ నిమిత్తం గ్రామానికి చెందిన ఒకరి నుంచి డబ్బులు డిమాండ్‌ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు కార్యదర్శి సంధ్యారాణిని రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శాఖాపరమైన విచారణలో భాగంగా అధికారులు జీపీ కార్యదర్శితోపాటు బాధితులను వేర్వేరుగా విచారించారు.

రైతులకు ప్రభుత్వంపై నమ్మకం పోతోంది

- ఇప్పటి వరకు మూడుసార్లు మోసగించారు
- రుణమాఫీ చేసే వరకు ఆందోళనలు చేస్తాం
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా



రైతులతో కలిసి జాతీయ రహదారిపై బైఠాయించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వంపై రైతులకు నమ్మకం పోతోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రతి రైతుకు బేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్‌ చేస్తూ 63వ నంబర్‌జాతీయ రహదారిపై వేల్పూర్‌ క్రాస్‌రోడ్డు వద్ద బాల్కొండ నియోజవర్గ రైతులతో కలిసి ప్రశాంత్‌రెడ్డి శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీపై కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులను ఇప్పటి వరకు మూడుసార్లు మోసగించిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను నమ్మించి మోసం చేశారని, గాలి మాటలు మాట్లాడి రైతులను మళ్లీ కలెక్టరేట్‌ చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. దేవుడు లాంటి కేసీఆర్‌ను కాదని, కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్ర వ్యాప్తంగా రైతులను రోడ్డు మీద కూర్చోబెట్టిందన్నారు. 15 ఆగస్టులోగా రుణమాఫీ చేస్తామని చెప్పి యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి, సమ్మక్క, సారక్క, సిద్దులగుట్ట, బాసర, కొమురవెల్లి మల్లన్న, రామప్ప శివలింగం, జూబ్లీహిల్స్‌ పెద్దమ్మతల్లి మీద ఒట్లు పెడితే నమ్మి ప్రజలు ఓట్లేశారన్నారు. రూ.31 వేల కోట్ల రుణమాఫీ అని చెప్పిన సీఎం.. రూ.17,900 కోట్లు మాఫీ చేశామని, రుణమాఫీ పూర్తయినట్లు ప్రకటించారని విమర్శించారు. కేటీఆర్‌ అన్నట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి మానసిక స్థితిపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయన్నారు. హరీశ్‌రావు చాలెంజ్‌ విసరడంతోనే ఈ మాత్రం రుణమాఫీ జరిగిందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్‌ చేశారు. ఎమ్మెల్యే సతీమణి నీరజారెడ్డి, రైతులు, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు. మహిళారైతులతో కలిసి వేల్పూర్‌ తహసీల్దార్‌ సంతోష్‌కు వినతిపత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు.

భారీగా నిలిచిన వాహనాలు

జాతీయ రహదారిపై ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేయడంతో ఆర్మూర్‌, మోర్తాడ్‌ వైపు భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్మూర్‌ ఏసీపీ బస్వారెడ్డి వేల్పూర్‌ క్రాస్‌రోడ్డుకు చేరుకొని ఆందోళనను విరమింపజేసే ప్రయత్నం చేయడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఆర్మూర్‌ ఆర్డీవో వచ్చి వినతిపత్రం తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో వేల్పూర్‌ తహసీల్దార్‌ వచ్చి వినతిపత్రం తీసుకోగా ఆందోళన విరమించారు. సబ్‌ డివిజన్‌ పోలీసులు భారీ సంఖ్యలో బందోబస్తు నిర్వహించారు.

రుణమాఫీని జీర్ణించుకోలేకపోతున్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్‌ భూపతిరెడ్డి

ఖలీల్‌వాడి: రుణమాఫీ చేసి కాంగ్రెస్‌ ప్రజలకు చేరువ కావడాన్ని హరీశ్‌రావు, కేటీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్‌ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ భూపతిరెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ చేస్తామని రైతులను 10 ఏళ్లు మభ్యపెట్టిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని అన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో డిపాజిట్లు దక్కించుకోలేని బీఆర్‌ఎస్‌ నాయకులు.. స్థానిక ఎన్నికల్లో అస్తిత్వాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 567లో రుణమాఫీపై స్పష్టంగా విధివిధానాలున్నాయని చెప్పారు. జీవోపై హరీశ్‌రావు, కేటీఆర్‌ మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. రుణమాఫీ వర్తించని రైతులు ఆందోళన చెందొద్దని, తప్పులను సరిచేసి రుణమాఫీని వర్తింపజేస్తామన్నారు. కాంగ్రెస్‌ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని చెప్పారు. ఈ ఖరీఫ్‌ నుంచే రైతులకు రూ.500 బోనస్‌ అందిస్తామన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రాజకీయ అవివేకి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమని, రుణమాఫీపై ధర్నా చేయడం ఆయన రాజకీయ అవివేకానికి నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్‌ హయాంలో గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి పేదలకు ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహెర్‌ బిన్‌ హందాన్‌, రాష్ట్ర కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌, నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు కేశ వేణు, జిల్లా కిసాన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, వేణురాజ్‌, సంతోష్‌, రాజనరేందర్‌గౌడ్‌, కార్పొరేటర్‌ రోహిత్‌, శ్రీనివాస్‌, గంగారెడ్డి, ఉమ్మాజీ నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఎదుట రైతుల ధర్నా

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆలూర్‌ మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు అధికారు నిర్లక్ష్యం కారణంగానే తమ రుణాలు మాఫీ కాలేదని ఆరోపిస్తూ రైతులు శనివారం బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కెనరా బ్యాంకులో ఆలూర్‌, దేగాం, మచ్చర్ల, గుత్ప, కల్లెడ గ్రామాలకు చెందిన సుమారు 2,500 మంది రైతులు రుణాలు తీసుకోగా, మూడు విడతల్లో కేవలం 410 మందికి మాత్రమే రుణమాఫీ వర్తించిందని, బ్యాంకు అధికారులు పూర్తి సమాచారాన్ని ప్రభుత్వానికి పంపకపోవడం వల్లే రుణమాఫీ కాలేదని రైతులు ఆరోపించారు. రూ.2 లక్షల రుణం తీసుకున్న వారితో మొత్తానికి మొత్తం చెల్లింప జేసుకున్నారన్నారు. బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే తాము రుణమాఫీకి నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సైతం రేషన్‌ కార్డు తదితర సాకులు చెబుతూ లబ్ధిదారుల సంఖ్యను కుదింపచేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆందోళ చేస్తున్న రైతుల వద్దకు వెళ్లారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రుణమాఫీ అయ్యేల చూస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. ఇదిలా ఉండగా.. సిండికేట్‌ బ్యాంకు సీనియర్‌ మేనేజర్‌ దుర్గా ప్రసాద్‌ మాట్లాడుతూ.. 2018 డిసెంబరు 12 వరకు రుణాలను రెన్యువల్‌ చేసుకున్న అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు.



బ్యాంకు ఎదుట రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

నేర పరిశోధనలో సలహాలివ్వాలి



ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ జి వైజయంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ పి లక్ష్మీనర్సయ్య ఉమ్మడి జిల్లాలోని పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లతో శనివారం జిల్లా కోర్టులో సమీక్ష నిర్వహించారు. నేర పరిశోధనలో జాగ్రత్తలు, నూతన చట్టాలను అవలంబించడంపై పోలీసులకు సలహాలు ఇవ్వాలని సూచించారు. బదిలీపై వచ్చిన కామారెడ్డి అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఏ కృష్ణవేణిని సన్మానించారు. సమావేశంలో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు పి రవిరాజ్‌, రాజగోపాల్‌గౌడ్‌, నంద రమేశ్‌, బంటు వసంత్‌, ఖాందేశ్‌ శ్రీనివాస్‌, దామోదర్‌రెడ్డి, అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు భూసారపు రాజేశ్‌గౌడ్‌, మహ్మద్‌ రహీముద్దీన్‌, కృష్ణవేణి, చిదిరాల రాణి, జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు గడ్డ క్రీడాకారుల అడ్డా

- నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతి రెడ్డి
- ఉత్సాహంగా కొనసాగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌ టోర్నీ



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: ఇందూరు గడ్డ అంతర్జాతీయ క్రీడాకారుల అడ్డా అని నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ భూపతిరెడ్డి అన్నారు. జిల్లా ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో డాక్టర్‌ కవితారెడ్డి సౌజన్యంతో పోలీసు పరేడ్‌ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి 10వ మహిళా ఫుట్‌బాల్‌ టో ర్నీ ఉత్సాహంగా కొనసాగుతోంది. రెండో రోజైన శనివారం ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే భూపతిరెడ్డి క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో ఆయా క్రీడల్లో రాణిస్తున్న యెండల సౌందర్య, నిఖత్‌ జరీన్‌, అర్జున అవార్డుగ్రహీత హుసాముద్దీన్‌,గుగులోత్‌ సౌమ్య జిల్లాకు గర్వకారణమన్నారు.అంతర్జాతీయ ఫుట్‌బాల్‌ క్రీడాకారిణి సౌమ్యను తీర్చిదిద్దిన కోచ్‌ నాగరాజుతోపా టు జిల్లా అసోసియేషన్‌ను ఎమ్మెల్యే అభినందించా రు.డాక్టర్‌ కవితారెడ్డి తన విధులను నిర్వర్తిస్తూనే టోర్నీ నిర్వహణకు తనవంతు సహాయం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారిణులను పరిచయం చేసుకొని మ్యాచ్‌లను ప్రారంభించారు.

రెండో రోజు మ్యాచ్‌లు..

మెదక్‌ – ఖమ్మం మధ్య జరిగిన మ్యాచ్‌లో మెదక్‌ జట్టు 2–0 తేడాతో, నల్గొండ – రంగారెడ్డి మధ్య జరిగిన మ్యాచ్‌లో నల్గొండ జట్టు 2–0 తేడాతో, నిజామాబాద్‌ – రంగారెడ్డి మధ్య జరిగిన మ్యాచ్‌లో నిజామాబాద్‌ జట్టు 2–0 తేడాతో, మహబూబ్‌నగర్‌ – కరీంనగర్‌ మధ్య జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్‌ జట్టు 11–0 తేడాతో విజయం సాధించాయి. నిజామాబాద్‌ జట్టుకు కోచ్‌గా భక్తపాల్‌, మేనేజర్‌గా మహమ్మద్‌ అజ్మత్‌ఖాన్‌ వ్యవహరిస్తున్నారు. జిల్లా ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్ష కార్యదర్శులు మీర్‌ ఫారూఖ్‌, మహ్మద్‌ జావీద్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ ఖలీద్‌, జాయింట్‌ సెక్రెటరీ అన్వర్‌, గిరి, సురేశ్‌, నరేశ్‌, తుకారాం తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి, నిజామాబాద్‌ జిల్లా జట్ల క్రీడాకారిణులతో సీనియర్‌ డాక్టర్లు, కోచ్‌లు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- అధికారులను అడ్డుకున్న స్థానికులు
- ఆర్డీవో, మున్సిపల్‌ అధికారులతో వాగ్వాదం



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న పొక్లెయిన్‌

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని నాగారం ప్రాంతంలో ఉన్న భారతీరాణి కాలనీ బొందం చెరువు శిఖం భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేత ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ప్రాంతంలో కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయించారు. మరి కొందరు శిఖం భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. పలువురు ప్రజాప్రతినిధులు భూమిని పట్టాలుగా చేసి విక్రయించారు. ఇదిలా ఉండగా, శనివారం ఉదయం అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బొందం చెరువు ప్రాంతానికి వెళ్లి అక్రమ నిర్మాణాలను కూల్చివేయగా, స్థానికులకు అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. మున్సిపల్‌, రెవెన్యూ, నీటిపారుదుల శాఖ అధికారులు సంయుక్తంగా నిర్మాణల తొలగింపు చేపట్టారు. నిజామాబాద్‌ ఆర్డీవో, మున్సిపల్‌ కమిషనర్‌, అధికారులు అక్కడే ఉన్నారు. చివరకు డిప్యూటీ మేయర్‌ ఇద్రీస్‌ఖాన్‌ వచ్చి ఆక్రమలణ తొలగింపుపై అధికారులతో మాట్లాడగా, కూల్చివేతను తాత్కాలికంగా నిలిపివేశారు.

భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి: నగరంలోని భారతీనగర్‌ కాలనీలో అక్రమ నిర్మాణలను అధికారులు కూల్చి వేయించగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఆరుగురు ఎస్సైలతోపాటు ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళాకానిస్టేబుళ్లు 40 మంది సిబ్బందితోపాటు ఫైర్‌ ఆఫీసర్‌ నర్సింగ్‌రావు, ఫైర్‌ సిబ్బంది పాల్గొన్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



నిజాంసాగర్‌(జుక్కల్‌): మహమ్మద్‌ నగర్‌ మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో గూల పోచవ్వ అనే మహిళకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటనలో పక్కనే ఉన్న మంగ బీరయ్యకు చెందిన ఇంటి కిచెన్‌తోపాటు ఆయన సోదరుల కిచెన్‌లు సైతం దగ్ధమయ్యాయి. పోచవవ్వ ఇంట్లోని డబ్బాలో దాచిపెట్టిన రూ.40వేల నగదుతోపాటు పట్టాపాస్‌పుస్తకాలు, ఆధార్‌, రేషన్‌కార్డులు, వంట సామగ్రి, దుస్తులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్‌సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. తహసీల్దార్‌ సవాయిసింగ్‌ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయనవెంట కాంగ్రెస్‌ నాయకులు ఆశిష్‌, తోట రాజు తదితరులున్నారు.

క్రైం కార్నర్‌

మానసికంగా కుంగి ఆత్మహత్య

ధర్పల్లి: ఒంటరితనం కారణంగా మానసికంగా కుంగిపోయిన ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని హొన్నాజీపేటలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హొన్నాజీపేట్‌కు చెందిన మిద్దెల లక్ష్మి (59) భర్త ఆరు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న లక్ష్మి మానసికంగా కుంగిపోయి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

సిరికొండ: మతిస్థిమితం సరిగాలేక కత్తితో గొంతుకోసుకున్న యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్సై ఎల్‌ రామ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొండూర్‌ గ్రామానికి చెందిన లక్కవత్రి మనోహర్‌కు ఇద్దరు కుమారులు ఉండగా, ఆయన చిన్న కుమారుడు ప్రదీప్‌(30) మతి స్థిమితం సరిగాలేక బాధపడుతున్నాడు. ఈ నెల 11న ఇంట్లోనే ప్రదీప్‌ కత్తితో గొంతు కోసుకున్నాడు. చాలా సేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రదీప్‌ (ఫైల్‌)

బస్‌షెల్టర్‌ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి మండలం నర్సన్నపల్లి బస్సు షెల్టర్‌ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారించామని, మృతుడి కుడి చేయిపై జశ్వంత్‌ అని హిందీ భాషలో పచ్చబొట్టు ఉందని, ఎల్లో కలర్‌ ఆఫ్‌ టీ షర్ట్‌, బ్లాక్‌ కలర్‌ నైట్‌ ప్యాంటు ఉన్నాయని తెలిపారు. మృతుడిని నార్త్‌ ఇండియాకి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రూరల్‌ సీఐ 87126 86148, దేవునిపల్లి ఎస్సై 87126 86150కి సమాచారం అందించాలని కోరారు.

చిరుతల సంచారం

నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని అచ్చంపేట శివారులో శనివారం రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో చిరుతోపాటు కూనలు సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రం నుంచి అచ్చంపేట వైపు తాము ద్విచక్రవాహనం వెళ్తుండగా.. చిరుతతోపాటు కూనలు తారసపడ్డాయని, కూనలకు హాని కలుగుతుందేమోనని చిరుత గాండ్రిస్తూ మంజీరా వైపు వెళ్లిపోయిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. అలాగే నెల రోజుల క్రితం నిజాంసాగర్‌ జవహర్‌ నవోదయ ఆవరణలో చిరుత సంచరించినట్లు విద్యార్థులు తెలిపారు. చిరుత సంచారం నేపథ్యంలో అచ్చంపేట గ్రామస్తులతోపాటు నవోదయ, అచ్చంపేట ఎస్సీ గురుకుల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.

మల్కాపూర్‌ శివారులో..

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మల్కాపూర్‌ (ఏ) గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. అటవీ అధికారులు గ్రామానికి చేరుకొని క్షేత్ర స్థాయిలో విచారించారు. గొర్రెల మందలో నుంచి ఓ గొర్రెపై చిరుత దాడి చేసినట్లు అటవీ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చి నట్లు సమాచారం.

ఇద్దరి బైండోవర్‌



ఇందల్వాయి: మండలంలోని పలు తండాలు, గ్రామాల్లో జిల్లా డీటీఎఫ్‌, ఏసీఎఫ్‌ టీములతోపాటు భీమ్‌గల్‌ ఎక్సైజ్‌ పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. నాటుసారా తయారు చేస్తున్న డొంకల్‌కి చెందిన మూడావత్‌ సోమ్లీ, వెంగల్‌పాడ్‌కి చెందిన బదావత్‌ విఠల్‌ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అనంతరం తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ వేణుమాధవరావు తెలిపారు. తనిఖీల్లో హెడ్‌ కానిస్టేబుల్‌ ఫయాజ్‌, మహేశ్‌, దత్తాద్రి పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

పిట్లం(జుక్కల్‌): మండల కేంద్రంలోని ఓ రైస్‌ మిల్లులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌ నాయక్‌ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో కలిసి రైస్‌ మిల్లులో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్‌ చేసి, వారి నుండి రూ. 2లక్షల 4వేల నగదుతోపాటు 10 సెల్‌ ఫోన్లు, ఒక బైక్‌, 5 కార్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పిట్లం ఎస్సై రాజు తెలిపారు.

ఇసుక డంప్‌ మాయంపై ఫిర్యాదు

పోతంగల్‌: రెవెన్యూ అధికారులు సీజ్‌ చేసిన ఇసుక డంపు మండల కేంద్రం శివారు నుంచి మాయం కావడంతో తహసీల్దార్‌ మల్లేశ్‌ శనివారం కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోతంగల్‌ శివారులోని మంజీరా రెండో బ్రిడ్జి దాటిన తరువాత డంప్‌ చేసిన ఇసుకను ఈ నెల 13న రెవెన్యూ అధికారులు సీజ్‌ చేశారు. మరుసటి రోజు వేలం వేయడానికి సన్నాహాలు చేస్తుండగా 14న ఉదయం సగానికి పైగా ఇసుక మాయమైంది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న తహసీల్దార్‌ విచారణ చేపట్టి ఇద్దరిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

మేకలను ఎత్తుకెళ్లిన దుండగులు

ఎల్లారెడ్డి : మండలంలోని అన్నాసాగర్‌ తండాలో శుక్రవారం రాత్రి మేకలు చోరీ అయినట్లు ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపారు. అన్నాసాగర్‌ తండాకు చెందిన కేతావత్‌ గోపికి చెందిన 11మేకలను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అకౌంట్‌ నుంచి రూ.70 వేలు మాయం

మాచారెడ్డి: పాల్వంచ మండలం పోతారం గ్రామానికి చెందిన దువ్వల సాయిలు తన బ్యాంకు ఖాతా నుంచి రూ.70 వేలు మాయమయ్యాయని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై అనిల్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..

దుబాయిలో ఉంటున్న తన కొడుకు సంతోష్‌ ఈ నెల 9న సాయిలు ఖాతాలోకి రూ.70వేలు పంపించాడు. ఈ నెల 12న సాయిలుకు డబ్బులు అవసరం ఉండి మాచారెడ్డి ఎస్‌బీఐకి వెళ్లగా ఖాతాలో డబ్బులు లేవని మేనేజర్‌ చెప్పడంతో అవాక్కయ్యాడు. తన ప్రమేయం లేకుండా డబ్బు లు ఎలా మాయమయ్యాయని లబోదిబోమన్నాడు. తాను ఓటీపీ, బ్యాంకు ఖాతాకు సంబంధించిన వివరాలు ఎవరికీ చెప్పకుండా డబ్బులు ఎలా మాయమయ్యాయని వాపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రిటైర్డ్‌ ఉద్యోగి ఇంట్లో చోరీ

కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి శివారులోని గోస్కె రాజయ్య కాలనీలో నివాసం ఉంటున్న ఆర్టీసీ రిటైర్డ్‌ ఉద్యోగి ఇంజమూరి రాములు ఇంట్లో శనివారం పట్టపగలు చోరీ జరిగింది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శనివారం ఉదయం కొడుకు, కోడలు ఊరికి వెళ్లిపోగా, ఆయన మధ్యాహ్నం పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. దుండగులు ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువా, లాకర్‌ను ధ్వంసం చేశారు. ఆరు తులాల బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదును ఎత్తుకెళ్లారు. రూరల్‌ సీఐ రామన్‌ ఘటనాస్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దుండుగులు పగులగొట్టిన బీరువా

బ్యాంకు అధికారి పేరుతో మోసం.. అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఇందల్వాయి: గోల్డ్‌లోన్‌ పేరిట అమాయకుడిని మోసం చేసేందుకు యత్నించిన ఓ వ్యక్తి పోలీసులకు శనివారం చిక్కాడు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌, ఇందల్వాయి ఎస్సై మనోజ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని స్టేషన్‌ తండాకి చెందిన బదావత్‌ ఉపేంద్రకి మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన తీగుట్ల మనోజ్‌కుమార్‌ ఈ నెల 5వ తేదీన ఫోన్‌ చేశాడు. తాను బ్యాంక్‌ మేనేజర్‌నని.. నీ పేరుపై నిజామాబాద్‌ ఇండియన్‌ బ్యాంకులో ఉన్న గోల్డ్‌ లోన్‌ గడువు ముగిసిందని, వెంటనే రూ.25 వేలు ఫోన్‌పే చేయకపోతే బంగారు నగలు జప్తు చేస్తామని చెప్పడంతో కంగారు పడ్డ ఉపేంద్ర.. ఏమీ ఆలోచించకుండా డబ్బులు పంపించాడు. ఆ తరువాత తన తల్లికి ఫోన్‌ చేసి జరిగింది చెప్పగా.. గోల్డ్‌లోన్‌ విషయంలో ఎలాంటి డబ్బు బాకీ లేమని ఆమె తెలపడంతో కంగారు పడ్డ ఉపేంద్ర జిల్లా కేంద్రంలోని ఇండియన్‌ బ్యాంకుకి వెళ్లి మేనేజర్‌ని సంప్రదించాడు. అటువంటి ఫోన్‌కాల్స్‌ బ్యాంక్‌ నుంచి రావని మేనేజర్‌ తెలపడంతో తేరుకున్న ఉపేంద్ర 1930కి కాల్‌ చేసి ఫిర్యాదు చేయగా, పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ప్రజలు సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌ కాల్స్‌ వస్తే జాగ్రత్త వహించాలని, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు ఇతరులతో షేర్‌ చేయొద్దని సీఐ మల్లేశ్‌ సూచించారు.